క్లుప్తంగా

చురుగ్గా పారిశుధ్య పనులు



పట్టణంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం ఇన్‌చార్జి కమిషనర్ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించారు. వార్డుల్లోని డ్రైన్లల్లో పూడికను తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. చెత్తసేకరించేందుకు ఇళ్లకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి తడిపొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు చేతుల మీదుగా స్థానిక 17వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సిరిపరపు రాజేష్, లోగీసు శేఖర్, బాదం సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్రం భూముల బహిరంగ వేలం వాయిదా

జగ్గంపేట: గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మి వెంకాయ్యమ్మ ధర్మసత్రానికి చెందిన భూముల బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్టు ఈఓ శర్మ తెలిపారు. సర్వే నెం 230, 231, 233లో గల 98.41ఎకరాలకు ఇ.టెండర్, బహిరంగ వేలం ఈనెల 6వ తేదీన జరగాల్సి ఉంది కానీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, త్వరలో వేలం తేది తెలియజేస్తామని అన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: పురుగుల మందు సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు గోకవరం పోలీసులు తెలిపారు. వారి వివరాలు ప్రకారం.. గోకవరం గ్రామానికి చెందిన నాగుల శేఖర్‌బాబు(42) సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని కుటుంబ సభ్యులు గోకవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగా మారింది. తర్వాత రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మరణించినట్టు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గోకవరం ఎస్సై శివనాగబాబు తెలిపారు.

సర్వే అధికారులను అడ్డుకున్న దళితులు

తొండంగి: శృంగవృక్షంలో వివాదాస్పద భూమిని సర్వే చేస్తున్న అధికారులను సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ ఆధ్వర్యంలో దళితులంతా అడ్డుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 249/2 లో 9.44 ఎకరాల భూమిని సర్వే చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండల సర్వేయర్ నిరంజన్‌రావు, ఇతర సిబ్బంది వెళ్లగా దళితులు అడ్డుకున్నారు. ఈభూమి అంతా తమ స్వాధీనంలో ఉందని ఇళ్ల స్థలాలకు కేటాయించుకునేందుకు తీర్మానించుకున్నామని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులకు దీర్ఘకాలం క్రితమే ఫిర్యాదు చేశామన్నారు. తమకు భూమి దక్కే వరకూ పోరాటం చేస్తామన్నారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్‌నాయకులు కె.జనార్దన్ దుత్తరపు సత్తిబాబు, బి.సత్తిబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఈస్టర్ కంటాట ప్రదర్శన

తుని: స్థానిక వికాస క్రీడా కేంద్రం ఆవరణలో ఈస్టర్ కంటాట ప్రదర్శన ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి స్కాట్‌స్మారక బాప్టిస్ట్ ఆలయం, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ తుని, పాయకరావుపేట సహకారంతో గ్లోబల్ క్రిస్టియన్ ఎంపావర్మెంట్ అసోసియేషన్ సమర్పణలో 50 మంది కళాకారులు కంటాట ఘనంగా ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బాలవరపు వెస్లీ, ఏపీపీఎస్సీ సభ్యుడు నూతలపాటి సోనివుడ్ పాల్గొన్నారు. మట్టల ఆదివారం, ఏసుక్రీస్తు పునరుద్ధానం విశిష్టతను వెస్లీ వివరించారు. ఏసుక్రీస్తుకు పట్టాభిషేకం చేయడమే మట్టల ఆదివారమని, మనలందరిని పాప విముక్తులను చేసి ఏసు పరలోకానికి ఆరోహణ అవడమే ఈస్టర్ పండగ ముఖ్య ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవులకు చేస్తున్న సేవలను కొనియాడారు. క్రైస్తవులంత ఐక్యంగా కలసి మెలసి ఉండాలని సోనివుడ్ పేర్కొన్నారు. ప్రతిఒక్కరు ఆదర్శంగా జీవించాలన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభ స్వామి వారి దివ్య కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లా దేవదాయ అధికారి, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ అధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళలు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కర్రి జగదీష్, రాకుర్తి కుమారి, పుల్లేటి కుమారి భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్..



ప్రత్తిపాడులో వాహనాల రద్దీ

- ఇరుకు రోడ్లతో వాహనాల రాపోకలకు ఇబ్బంది
- గంటల తరబడి నిలిచిపోతున్న వైనం
- అవస్థ పడుతున్న ప్రయాణికులు

ప్రత్తిపాడు: ఇరుకు రోడ్లు, వాహనాల రద్దీతో ప్రత్తిపాడులో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. బుధవారం వారపు సంత రోజు ట్రాఫిక్ మరింత ఎక్కువగా ఉంటోంది. ఈ సమయాల్లో రోడ్డుపై నడవాలంటే వృద్ధులు, పిల్లలు అపసోపాలు పడాల్సి వస్తోంది. అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో అటు కాకినాడ, ఇటు రాజమహేంద్రవరం రోడ్లు రద్దీకి తోడు మరో వైపు ఇరుకుగా ఉన్న తుని వెళ్లే ఈ దారుల్లో లారీలు, బస్సులు, జీపుల, ట్రాక్టర్లు, ఆటోలు మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనాల రాకపోకలు అధికం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ ట్రాఫిక్ క్లియర్ చేయలేక పోలీసులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

ట్రాఫిక్‌తో రోడ్డు ప్రమాదాలు

ఆర్టీసీ బస్ కాంప్లెక్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, తుని రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానా అవస్థలు పడాల్సివస్తోంది. బస్సు, గడ్డి లోడు ట్రాక్టరు, లారీలు భారీ వాహనాలు ఒకదానికొకటి ఎదురుపడితే ట్రాఫిక్ జామే. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీసులు లేకపోవడంతో సమస్య జఠిలంగా మారుతోంది. ట్రాఫిక్ సమస్య మూలంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే రెండు బైక్‌లు ఢీకొనడంతో గ్రామానికి చెందిన ఇరువురూ తీవ్ర గాయాల పాలై ఇంకా చికిత్స పొందుతూనే ఉన్నారు. పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లని ప్రమాదాలెన్నో... ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు



ప్రత్తిపాడులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో పోలీసులను నియమించి, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎం.పవన్‌కుమార్, ఎస్సై, ప్రత్తిపాడు

మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



లింగంపర్తిలో ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత ప్రసాద్
- లింగంపర్తిలో ఆసరా చెక్కుల పంపిణీ

ఏలేశ్వరం: మహిళల ఆర్థికాభివృద్ధిపై సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. లింగంపర్తి గ్రామంలో మంగళవారం రూరల్ పరిధిలో 893 డ్వాక్రా సంఘాలకు రూ.76944738.75 ఆసరా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సీఎం జగన్ పాలనలో మహిళలు అన్నిరంగాల్లో రాణించారన్నారు. మహిళల స్వావలంబన ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. మహిళలందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. అనంతరం సీఎంజగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, మండల కన్వీనర్ అడపా పార్థసారధి, సొసైటీ చైర్మన్ చిక్కాల లక్ష్మణరావు, వైస్ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మి, సాదే లోవరాజు, ఏపీఎం సత్యప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు శ్లాఘనీయం



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న కన్యాకుమారి

ప్రత్తిపాడు: లయన్స్‌క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (ఆర్ఎంఓ) ఎం.కన్యాకుమారి కొనియాడారు. ప్రతి నెలా వైద్య సహాయం కోసం దూర ప్రాంతాల నుంచే గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్య పరీక్షల కోసం మంగళవారం దూరప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 70 మంది గర్భిణులకు ఆమె పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ పౌష్టికాహారాన్ని హైదరాబాద్‌కు చెందిన ఏవీవీ రమేష్ సమకూర్చారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యురాలు ఎం.శ్వేత, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఏడిద రెడ్డినాయుడు, తాతా సాంబు, కె.సంజీవరావు, ఇంజినీర్ బి.మోహన్, వైఎస్సార్ సీపీ నాయకుడు శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పింఛన్ పంపిణీ



భద్రవరంలో వృద్ధుడికి పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: వైఎస్సార్ పింఛన్ పథకంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెలవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు. మండలంలోని 90శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. ప్రస్తుతం నియోజవర్గంలో 24 వేలకు పైగా వృద్ధాప్య, వితంతవు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. మండలంలోని ఏలేశ్వరం, భద్రవరం, లింగంపర్తి తదితర గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. భద్రవరం గ్రామంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో పింఛన్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమక్షంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

- ఎంపీపీ పర్వత రాజుబాబు
- మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

శంఖవరం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ పర్వత రాజుబాబు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. చేతి పంపులకు మరమ్మతులు చేయాలని, కుళాయిలను బాగుజేయాలని, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండే విధంగా చూడాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకటరమణ, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ ఎస్వీ రమణ, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టులో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన జగ్గంపేట విద్యార్థులు

జగ్గంపేట: నాసా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టులో ఆంధ్రప్రదేశ్ నుంచి 18 ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో జగ్గంపేట విద్యార్థులు ఉభయగోదావరి జిల్లాలోనే మొదటిస్థానం సాధించారు. జగ్గంపేటలో మంగళవారం శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ నాసా నిర్వహించిన స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టులో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, వారు తయారు చేసిన ప్రాజెక్టు అవార్డు విన్నింగ్ ప్రాజెక్టుగా ఎంపికైనట్టు తెలిపారు. ప్రపంచంలోని 308పైగా దేశాలకు చెందని విద్యార్థులు ఈ కాంటెస్టులో పాల్గొన్నారని, వీటిలో 138 ప్రాజెక్టులు ఎంపిక చేశారని తెలిపారు. అందులో భారతదేశం నుంచి 89 ప్రాజెక్టులు ఎంపిక కాగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ప్రాజెక్టులు 18 అని వివరించారు. ఈ 18 ప్రాజెక్టుల్లో జగ్గంపేట శ్రీచైతన్య విద్యార్థుల ప్రాజెక్టు ఉభయ గోదావరి జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆ విద్యాసంస్థల ఏజీఎం వైఎస్ఎస్ ఆర్ఐ పి.శ్రీనివాస్, కో ఆర్డినేటర్ పట్నాయిక్, డీన్ నాగేంద్ర తదితరులు అభినందించారు. సి.బ్యాచ్ ఇన్‌చార్జి గోవిందు, నాసా టీచర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఒంటిపై ఆభరణాల చోరీ

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో వృద్ధురాలు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. కాలనీలోని కాసే వెంకటలక్ష్మి అనే 75 సంవత్సరాలు వయసు గల వృద్ధురాలు మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తుండగా సుమారు 22 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండున్నర కాసుల గొలుసు, చెవికి ఉన్న దుద్దులు చోరీ చేశాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శివ నాగ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలకు అదనపు ఆదాయమే లక్ష్యం

జిల్లా పంచాయతీ అధికారి విక్టర్



వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

కోటనందూరు: పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ సాగుతోందని జిల్లా పంచాయతీ అధికారి రోలకంటి విక్టర్ అన్నారు. మంగళవారం ఇండుగపల్లిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కేంద్రం పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన కేంద్రం నిర్వహణపై పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్, గ్రీన్ అంబాసిడార్లను అడిగి తెలుసుకున్నారు. వర్మీ కంపోస్టు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీపీఓ విక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 277 సంపద కేంద్రాలు వినియోగంలో ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా నాణ్యమైన వర్మీకంపోస్టును తయారు చేస్తూ పంచాయతీలకు ఆదాయం సమకూరుస్తున్నామన్నారు. తక్కువ ధరకే విక్రయిస్తున్న నాణ్యమైన వర్మీకంపోస్టుపై అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు రైతులకు అవగాహన కల్పించి కొనుగోలు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు కుశిరెడ్డి అప్పలరాజు, రావాడ రామచంద్రకుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ధనరాజ్ పాల్గొన్నారు.

కోట్ల రూపాయలు ఎవరు తిన్నారో నిరూపించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు నాగబాబు

కిర్లంపూడి: జగపతినగరం ఇళ్ల స్థలాల్లో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కోట్ల రూపాయలు తిన్నారంటూ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేసిన ఆరోపణలు నిరుపించాలంటూ వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు డిమాండ్ చేశారు. మంగళవారం కిర్లంపూడిలో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జగపతినగరం పంచాయతీ పరిధిలో ఊరు శివారున సుమారు 1500 మంది నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, ఈ ఇళ్ల స్థలాలు ఏర్పాట్లలో అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కోట్ల రూపాయాలు తినేశారని పదే పదే ప్రతిపక్ష పార్టీలు విమర్శించడం సరికాదన్నారు. కోట్ల రూపాయాలు తినేశారని ఆరోపించడం కాదని ఏవిధంగా జరిగిందో నిరూపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, శరకణం సంతోష్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

8న రన్ ఫర్ జీసస్

పెద్దాపురం: ఈ నెల 8వ తేదీన రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్వర్ణ దేవాలయం స్వస్థత శాల వ్యవస్థాపకుడు జీఆర్ ఇమ్మానియేలురాజ్, రన్ ఫర్ జీసస్ కో ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్‌దాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధరించే టీ షర్టులు, క్యాప్‌లు, జెండాలను వారు మంగళవారం ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ రన్ ఫర్ జీసస్ ర్యాలీ ఉంటుందన్నారు. దీని ప్రారంభోత్సవంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు పాల్గొంటారని చెప్పారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

పెద్దాపురం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆర్‌డీఓ జె.సీతారామారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పి.సరిత అన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై ఏరియా ఆసుపత్రి పీపీ యూనిట్ వైద్యులు ఎస్.సుదీప్తి అధ్యక్షతన మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ, డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, బాలికలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కొత్తగా స్కాన్ సెంటర్లు ఏర్పాటు చేసుకునే వారు ముందుగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి అనుమతి పొందాలని చెప్పారు. స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ సమాచారాన్ని చట్ట ప్రకారం బహిర్గతం చేయకూడదని, దీనిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కిశోర బాలికలకు గర్భ నిర్ధారణపై అవగాహన కల్పించారు. లీగల్ అడ్వైజర్ రవికుమార్, కందుల వెంకటాచలం, వైద్యులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ వరిసాగు

- పంటకు పుష్కలంగా సాగునీరు
- ఏడు వేల ఎకరాల్లో పంట



ఎ.కొత్తపల్లి-కోదాడలో సాగవుతున్న వరిచేలు

తొండంగి: వరుణుడి కరుణించడంతో ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లో చెరువులు, ప్రాజెక్టులు నిండి సాగునీరు పుష్కలంగా లభించింది. మెట్టలో వరిసాగు ఆశాజనకంగా ఉంది. తుని సబ్ డివిజన్‌లో రెండో పంటకు సాగునీరందడంతో వరి పంటలు ఈనుక, కోత దశలకు చేరుకున్నాయి. వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏడు వేల ఎకరాల్లో సాగు

వ్యవసాయంలో వరిసాగు లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం వ్యవస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, పరికరాలు అందించింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగు అనంతరం తుని సబ్‌డివిజన్‌లో రెండో పంటగా వరిసాగుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఇరిగేషన్ అధికారులతో చర్చించి పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాలకు సాగునీటి విడుదలకు కృషి చేశారు. దీంతో తొండంగి మండలంలోని 6350 ఎకరాల్లోనూ, తుని మండలం 139 ఎకరాల్లోనూ, కోటనందూరు మండలంలో 18 ఎకరాల్లో మొత్తం 6507 ఎకరాల్లో వరిసాగు చేశారు. కాగా రౌతులపూడి మండలంలో 166 ఎకరాల్లోనూ, శంఖవరం మండలంలో 394 ఎకరాల్లోనూ కూడా రబీలో వరిసాగు జరిగింది.

నీటి ఎద్దడి రాకుండా..

ఏటా రబీలో వరిసాగుకు పంట మధ్య కాలం నుంచే సాగునీటి ఎద్దడి నెలకొని పంటలు ఎండిపోవడంతో రైతులు ఇబ్బందిపడే పరిస్థితి ఉండేది. ఈ ప్రభుత్వంలో వరుసగా మూడో ఏడాది కూడా మండలంలోని పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతానికి సాగునీటిని అందించారు. వరినాట్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ సాగుకు నీరందిస్తున్నారు. దీంతో ప్రస్తుతం పంటలన్నీ ఈనుక దశలో వేపుగా ఉన్నాయి. మరి కొద్ది రోజుల్లో వరికోతలు ప్రారంభంకానున్నాయి. సాగునీటి సరఫరా సమృద్ధిగా అందడంతో రైతుల మధ్య నీరికట్టులో ఎటువంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా వ్యవసాయ పంటలు సాగు చేసుకుంటున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. ఇప్పటికే ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను కొనుగోలు నిర్వహించారు. కొంత మంది రైతులు తమ పంటలను పంట పొలాల్లో నిల్వ చేసి రబీ వరి చేలతోపాటు నూర్పిడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఖరీఫ్, రబీ పంటలను కలిపి కొనుగోలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే గ్రామ సచివాలయాల అసిస్టెంట్లకు ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలపై శిక్షణ ఇచ్చామని మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చాం



ఖరీఫ్‌లో 790 మంది రైతుల నుంచి నేరుగా 2360 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. దీనికి సంబంధించిన రవాణా ఖర్చులతో సహా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రబీలో కూడా ఏప్రిల్ రెండో వారం నుంచే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించనున్నాం. దీనికి సంబంధించి వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చాం.

–ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి

సాగునీరు అందడంతో..



నేను మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రబీ వరి సాగు చేస్తున్నా. పంట ప్రారంభం నుంచి పుష్కలంగా సాగునీరందింది. ప్రస్తుతం పంట ఈనుక దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో పంట కోత కోస్తాను. సాగు నీటి ఇబ్బంది లేకుండా ఉంది. అంతేకాకుండా ధాన్యం ఎక్కడ విక్రయించాలి అనే బెంగ లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

–కె.మాణిక్యం, రైతు, తొండంగి

ఎమ్మార్సీని తనిఖీ చేసిన సీఎంఓ



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: స్థానిక మండల రీసోర్సు సెంటర్ (ఎమ్మార్సీ)ను జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) చామంతి నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎమ్మార్సీలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్సీలోని జగనన్న విద్యా కానుక నిల్వలను తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న తరగతి గదులను పరిశీలించి, కిటికీలకు తలుపులు లేకపోవడాన్ని గమనించి, తక్షణం ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధ్యాయ డైరీలు, పాఠ్య ప్రణాళికలను సీఎంఓ చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు వై అచ్చిరాజు, సీఆర్పీలు రాంజీ, అప్పన్న మల్లేషు, గంగారావు తదితరులున్నారు.